మూడు కిలోమీటర్లు.. 200 గుంతలు

- ఆనవాళ్లు కోల్పోయిన యంచ–నందిగామ రహదారి
- రూ.2.35 కోట్లు మంజూరు.. ముందుకురాని గుత్తేదార్లు



నందిగామ రహదారిపై ఏర్పడిన గుంతలు



నవీపేట : మండలంలోని మారుమూల గ్రామమైన నందిగామకు వెళ్లేదారి రహదారి పూర్తిగా గుంతలతో కూరుకుపోతుంది. బాసర రహదారి పక్కన ఉన్న యంచ గ్రామం నుంచి మూడు కిలో మీటర్లు వెళ్తే ఈ గ్రామం వస్తుంది. 15 ఏళ్ల క్రితం మరమ్మతులు చేసిన రహదారికి మళ్లీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో నామరూపాల్లేకుండా పూర్తిగా గుంతలతో నిండిపోయింది. ఈ దారి గుండా అడుగు తీసి అడుగేస్తే మళ్లీ గుంతనే భయపెడుతోంది. బైక్‌లు మినహా ఇతర వాహనాల రాకపోకలు గ్రామానికి నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి మునుపటికి భిన్నంగా మారిపోయింది. గోదావరి నది తీరాన ఉన్న ఈ గ్రామానికి వెళ్లాలంటే యంచ, బినోల మీదుగా వెళ్లాలి. బినోల రహదారి పూర్తిగా ధ్వంసమవగా పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్న ప్రధాన మార్గం వెంబడి లెక్కలేనన్ని గుంతలు ఇబ్బందులకు గురిచేస్తోంది.

బిల్లులు రాకపోవడంతో..

యంచ–నందిగామ రహదారి మరమ్మతులకు రెండు నెలల క్రితం రూ. 2.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ ఈ పనులు నిర్వహించేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో పాటు కేటాయించిన నిధులు సరిపోవని ఆసక్తి చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిధులు అలాగే మూలుగుతున్నాయి.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



నందిగామ నుంచి యంచ వరకు ఉన్న రహదారి పూర్తిగా చెడిపోయింది. వర్షాకాలంలో రాకపోకలకు మరింత ఇబ్బంది అవుతోంది. గర్భిణులు, వృద్ధులు, రోగులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ధ్వంసమవడంతో ఆర్టీసీ బస్సు రాకపోకలు కూడా నిలిచిపోయాయి.

– భూంరావు, గ్రామ పెద్ద, నందిగామ

పట్టించుకోవడం లేదు



రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని అభివృద్ధికి దూరం మా గ్రామం. ఇంటర్నెట్ సౌకర్యం లేక సిగ్నల్స్ అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే యంచ–నందిగామ రహదారి నరకం చూపిస్తోంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

– డి.సంజీవ్, గ్రామస్తుడు, నందిగామ

గుత్తేదారులు ముందుకు రావడం లేదు

యంచ–నందిగామ రహదారి మరమ్మతులకు రెండు నెలల క్రితం రూ. 2.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆన్‌లైన్‌లో టెండర్లకు ఆహ్వానించగా గుత్తేదారులు ముందుకురావడం లేదు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. ఉన్నతాధికారులు స్పందించాలి.

– జబేర్, ఏఈ పీఆర్, నవీపేట

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



మోర్తాడ్: పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్ సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రగతి కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాములు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ పటేల్, గంట అశోక్, మగ్గిడి ప్రవీణ్, సాయిరెడ్డి, దశేంధర్, నవీన్ రెడ్డి, రవి, వినయ్ సాగర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



నవీపేట: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, దసరా పండుగను పురస్కరించుకుని బోనస్‌తో పాటు కొత్త బట్టలు, చెప్పులు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, నాయకులు ఆంజనేయులు, పోశెట్టి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం



వర్ని: ప్రతి గ్రామంలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకువస్తున్నట్లు వర్ని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సురేశ్ బాబా పేర్కొన్నారు. గురువారం మండలంలోని సైదిపూర్‌లో నూతన రేషన్ దుకాణాన్ని ఏఎంసీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయిలు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రనజా నాయక్, బాబు, రూప్లా, కిషన్, బంజారా రెడ్డి, హరినాయక్, నరేందర్, చందర్ పాల్గొన్నారు.

ఆలయంలో పల్లకి సేవ



వేల్పూర్: వేల్పూర్ సాయిబాబా ఆలయంలో గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, కాగడ హారతి ఇతర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి సేవకుడు కంకణాల రాజేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలను వినియోగించుకోవాలి



బాల్కొండ: కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. గురువారం బాల్కొండలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బోధన ప్రమాణాలను పెంచేందుకు ఈ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ కార్యదర్శి శ్రీలక్ష్మి, రిసోర్స్ పర్సన్ నాగుల రాజేందర్ పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి



ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను వెంటనే సరఫరా చేసి రైతుల కష్టాలను తీర్చాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు భూమన్న, ఆలకుంట సాయిలు, రవి, ఎల్లయ్య దాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల వితరణ

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక వీడీసీ తరఫున రూ. పది వేల విలువైన క్రీడా దుస్తులను గురువారం వితరణ చేశారు. ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించే మండలస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి క్రీడా దుస్తులను వితరణ చేసిన వీడీసీ సభ్యులకు హెచ్ఎం రమేశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్‌లో నిర్వహించిన మండల అంతర పాఠశాలల క్రీడా పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి. నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు రవి, ప్రవీణ్‌రెడ్డి, రఫీ, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బాలుర పాఠశాలలో 63వ ఆర్మూర్ మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ఆర్మూర్‌తో పాటు మామిడిపల్లి, పెర్కిట్‌లోని ప్రభుత్వ, 29 ప్రైవేట్ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ క్రీడల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని 36 వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అదనపు కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణ స్టేజీలను పరిశీలించారు. అనంతరం వార్డు ఆఫీసర్లతో మాట్లాడారు. బోధన్ మున్సిపల్‌కు మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో దశలవారిగా ఉన్న ఇళ్లతో పాటు నిర్మాణం చేపట్టని ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు చెల్లించిన బిల్లులు, బల్దియా ఆస్తిపన్ను వివరాలు, రావాల్సిన రెవెన్యూ ఆదాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలు, బల్దియాకు రావాల్సిన రెవెన్యూ ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ జాదవ్ కృష్ణకు సూచించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బల్దియా అధికారులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



అమ్రాద్‌లో అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

మాక్లూర్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని అమ్రాద్, ముత్యంపల్లి గ్రామాల్లో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 బృందాల వలంటీర్లు శీతాకాల శిబిరాల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామస్తులకు పేపర్ బ్యాగులను పంచి పెట్టారు. ముత్యంపల్లిలో డాక్టర్ శ్రీశైలంతో వైద్య శిబిరం నిర్వహించి చిన్నారులకు వైద్యం అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ఆర్ మమత, కె మాధవి, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి



గణేశ్ మండపాల నిర్వాహకులకు బహుమతులు అందించిన ఎస్సై అనిల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి : ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు గణేశ్ ఉత్సవాలు, మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జన కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన మండపాల నిర్వాహకులకు ఎస్సై చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మాదిగ యూత్, గ్లోబల్ యూత్, ఓం పద్మశాలీ విజయ సంఘం సభ్యులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సభ్యులు దొంతుల రమణయ్య, ఉట్నూర్ రాజశేఖర్, బోగ రామస్వామి, అమెడ నరేందర్, ఆమెటి శంకర్, అజయ్, అడిచర్ల రవీందర్, దాత్రిక రాజ్ కుమార్, ఉట్నూర్ ధోని, చింత హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



చైర్మన్ రాజిరెడ్డిని సన్మానించిన నాయకులు

వర్ని: మోస్రా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో అవసరమైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం మోస్రాలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతమున్న భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామ పెద్దలు సూచన మేరకు ఇతర భవనంలోకి నాలుగు రోజుల్లో గ్రంథాలయాన్ని మార్చి అన్ని రకాల సౌకర్యాలతో పాటు పుస్తకాలు, న్యూస్ పేపర్లు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. అనంతరం నాయకులు ఆయనను సన్మానించారు. వర్ని ఏఎంసీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్, సాయిలు, నర్సారెడ్డి, పోతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



కోటగిరిలో విద్యార్థులకు జ్ఞాపికను అందించిన ఎంఈవో శ్రీనివాస్‌రావు

రుద్రూర్/ మోర్తాడ్/ కమ్మర్‌పల్లి/ నవీపేట్: కోటగిరి మండల కేంద్రంలో గురువారం రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా మండ ల స్థాయి గణితం, సామాన్య శాస్త్రాలపై క్విజ్ పోటీ లు నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రా థమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 60 మంది హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన సోమ అద్విక్, పి.శివాలను మెమొంటో, బహుమతులను ఎంఈవో శ్రీనివాస్‌రావు అందించారు. కార్యక్రమంలో మహజన్ నర్సింలు, ద్రోణవల్లి ఉదయ్ చందర్, ఎమ్మార్సీ సిబ్బంది భూపేందర్, ఈర్వంత్, మహేశ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన రక్షిత, హార్తిక్‌లకు ఎంఈవో స్వామి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు శేఖర్, అశోక్, ప్రభా కర్, రఘుదాస్ పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని కోనసముందర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్నత, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మధుప్రియ, శ్రీలాస్య, అభియాన్, జి. మహవీర్, జి. సాధ్యకు ఎంఈవో ఆంధ్రయ్య బహుమతులు అందజేశారు. హెచ్ఎం మధుపాల్, పి. చంద్రశేఖర్, శంకర్‌గౌడ్, కిషన్, మారుతి, ప్రసాద్ పాల్గొన్నారు. నవీపేట్ మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన యశ్వంత్, లక్ష్మిలకు బహుమతులు అందజేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ బోధన్కర్ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో విజేతలకు బహుమతులను అందించిన ఎంఈవో



కోనసముందర్‌లో.. కమ్మర్‌పల్లి ఎంఈవో



నవీపేట్‌లో..

వేల్పూర్‌లో జీపీవోల నియామకం

వేల్పూర్: మండలంలో 14 మంది గ్రామపాలన అధికారులు నియమితులైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్ గురువారం తెలిపారు. పడగల్ 1, 2కు అయిత నరేందర్, బండి గంగాధర్, అక్లూర్‌కు పాలాస శ్వేత, వేల్పూర్ 1, 2కు పర్కల కిషన్‌గౌడ్, సంగం గంగాధర్, వాడికి డి.మోహన్, లక్కోరకు బేగరి వినోద్‌కుమార్, జాన్కంపేట్‌కు సుంకరి గంగాధర్, కుకునూర్‌కు ఎస్.ప్రవీణ్, పచ్చలనడ్కుడ 1, 2కు టి. కిషన్‌గౌడ్, బద్దం నవీన్, మోతెకు లొక్కిడి హరిచరణ్, రామన్నపేట్‌కు తాళ్ల మధుసూదన్, అంక్సాపూర్‌కు అబ్బ సుధాకర్ నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

బోధన్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా కాకుండా ఉండేందుకు అధికారులు డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాలని ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు గంగామణి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా పెరగడంతోనే యువత పెడదారి పడుతున్నారని వెంటనే వాటిని నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బిపాషా బేగం, కాంతాబాయి, లక్ష్మి, నాగమణి, సువర్ణ, లతా, గంగామణి, సుజాత, సునంద తదితరులు పాల్గొన్నారు.

బలవీర్ చిత్రాలు.. భలే భలే



రుద్రూర్ విఠలేశ్వర ఆలయం వద్ద ఆకట్టుకుంటున్న బలవీర్ గీసిన చిత్రాలు



జగద్గురు ఆది శంకరాచార్యుల చిత్రాన్ని గీస్తున్న చిత్రకారుడు బలవీర్

రుద్రూర్ : మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రముఖ చిత్రకారుడు ఇందూరి బలవీర్ బాలకృష్ణ గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విఠలేశ్వర స్వామి ఆలయంలోనే ఉన్న సార్వజనిక్ గణేశ్ మండలి డైమండ్ జూబ్లీ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలోని ప్రహరీకి చిత్రకారుడు బలవీర్ ద్వారా వివిధ చిత్రాలు గీయించారు. ఆయన ఆలయ ప్రాంగణంలో వేసిన పండరీపురం పాదయాత్ర దిండి, బారాడ్‌కు సంబంధించిన చిత్రాలు, హిందూ ధర్మపరిరక్షణకు భారతజాతి సమైక్యతకు పాటుపడిన మహనీయుల చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పలు చిత్రకళా పురస్కారాలు అందుకున్న బలవీర్‌ను సార్వజనిక్ గణేశ్ మండలి, శ్రీ విఠలేశ్వర ఆలయ సభ్యులు అభినందించారు. దేవతా చిత్రాలనే కాకుండా ప్రకృతి, పంట పొలాలు, నదుల బొమ్మలు కళ్లకు కట్టినట్టుగా వేశారు. పలు ప్రశంస పత్రాలు, అవార్డులు సాధించారు. చిత్రకళా రంగంలో రాణిస్తున్న పాత వర్నికి చెందిన బలవీర్ సేవలను గుర్తించి తెలంగాణ ఐకాన్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ అవార్డును ఈ నెల 22న రవీంద్ర భారతిలో అందుకోనున్నారు.

నవీపేట్‌లో మిలాద్ ఉన్ నబీ



నవీపేట: ముస్లిముల ఆరాధ్య దైవమైన మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిములు ఘనంగా నిర్వహించారు. ప్రార్థన మందిరాల నుంచి పలు వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

ఆర్మూర్‌లో భారీ వర్షం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అంతర్గత రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



డొంకేశ్వర్: విద్యాశాఖ ఆధ్వర్యంలో డొంకేశ్వర్ మండల కేంద్రంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రామకృష్ణ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ఉత్తమ హెచ్ఎంగా అవార్డు పొందిన సురేశ్ కుమార్‌ను వీడీసీ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్, టీఆర్‌టీయూ, తపస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పసుపు పరిశోధన స్థాన సందర్శన



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానాన్ని జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. పసుపు రకాలు, ల్యాబ్‌ను పరిశీలించి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు పరిశోధనల గురించి వివరించారు.

ఇసుక మేటలు తొలగించాలి



మోర్తాడ్: భారీ వర్షాల వల్ల వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేయగా వాటిని తొలగించడానికి వేగంగా చర్యలు చేపట్టాలని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 124 మంది రైతులకు చెందిన 85 ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని దీనిని తొలగించడానికి అంచనాలను తయారు చేసినందున వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో ఆదేశించారు. వ్యవసాయాధికారిణి లావణ్య, ఏపీవో నర్సయ్య, ఇంజినీర్ కన్సల్టెంట్ పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన నాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పెద్ద మరణంతో బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నందున స్థానికులు సామాజిక కార్యకర్త సితాలే రమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన వాట్సప్ స్టేటస్ ద్వారా సేకరించిన రూ. 13,500 నగదును బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. అనంతరం కుటుంబీకులకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రెజ్లింగ్ క్రీడాకారిణికి..

పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణి ఆజ్మీరా లక్ష్మీకి గురువారం కోనేరు శశాంక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. ఐదు వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే పోతంగల్ కల్లూర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి రేకుల షెడ్డు దెబ్బతిన్న ఒంటరి మహిళ సాయమ్మకు రూ. ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు ప్రకాశ్ పటేల్, నాయకులు ఓమన్న పటేల్, సంతోష్ పటేల్, గంగాధర్ పటేల్, రాజు, వినోద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.